బస్సు, నీటి చార్జీలపై త్వరలో నిర్ణయం : సీఎం

బెంగళూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బస్సు చార్జీలను పెంచే అవకాశం ఉందని అయితే ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సీఎం సిద్ధరామయ్య తెలిపారు. కొన్నేళ్లుగా నీటి చార్జీలు పెంచలేదన్నారు. జలమండలి కష్టాలు, నష్టాలను అధిగమించేందుకు చార్జీల పెంపు ఒక్కటే అనివార్యమన్నారు. త్వరలోనే చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు. కేపీఎస్సీ పరీక్ష మార్పులో గందరగోళంపై స్పందిస్తూ పరీక్షలను వాయిదా వేయడం లేదని, అయితే కృష్ణాష్టమి రోజున జరిగే పరీక్షను మరోరోజు నిర్వహించనున్నట్లు తెలిపారు.


హబ్‌లో సిద్ధమయిన సోలార్ ప్యానెళ్లు

సోలార్ పవర్

- సౌరశక్తితో ఎలక్ట్రిక్ వాహనాలకు చార్జింగ్ సదుపాయం
- కెంపేగౌడ విమానాశ్రయం వద్ద 81 భారీ ప్యానెళ్ల ఏర్పాటుకు చర్యలు
- దేశంలోనే 24గంటలూ పనిచేసే తొలి కేంద్రం
- రెండు ప్రైవేట్ సంస్థల సహకారంతో నిర్మిస్తున్న బెస్కాం



బెంగళూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాజధాని బెంగళూరు నగరంలోనే కాక విద్యుత్‌తో నడిచే వాహనాల సంఖ్య రాష్ట్రవ్యాప్తంగా క్రమంగా పెరుగుతోంది. ఇటీవల అంతర్జాతీయ విమానాశ్రయానికి ఎలక్ట్రిక్ వాహనాల రాక అధికమైంది. విమానాశ్రయ ఆవరణలో ఈవీ చార్జింగ్ పాయింట్‌లు ఉన్నా అవి విమానాశ్రయ వాహనాలకు మాత్రమే పరిమితం అయ్యాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) అందుబాటులోకి వచ్చాయి. ఈవీ బైక్‌లు, కార్లకోసం కొన్ని పెట్రోల్ బంకులలో ప్రత్యేక చార్జింగ్ సదుపాయాలు ఉన్నాయి. దేశంలోనే తొలిసారిగా సౌరశక్తిని ఉపయోగించి బ్యాటరీ స్టోరేజీ ఎలక్ట్రిక్ వెహికల్ చార్జింగ్ సెంటర్‌ను దేవనహళ్ళిలోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపాన నిర్మించనున్నారు. బెస్కాం ఆధ్వర్యంలో ప్రైవేట్ సంస్థ సహకారంతో నిర్మిస్తున్న ఈ చార్జింగ్ హబ్‌లో ఏకకాలంలో 23 వాహనాలను చార్జ్ చేసే వీలుంటుంది. వీటిలో అరగంట నుంచి ఒక గంటలోపు చార్జ్ చేసే 20 ఫాస్ట్ చార్జింగ్ పాయింట్‌లు, 3 సామాన్య చార్జింగ్ పాయింట్‌లు ఉన్నాయి. జీఐజడ్, నూనమ్ కంపెనీల సహకారంతో నిర్మిస్తున్న ఈ హబ్‌లో 50 కేడబ్ల్యు, 30 కేడబ్ల్యు సామర్థ్యం కల్గిన ఫాస్ట్ చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నారు. 7.5 కేడబ్ల్యు 3.3 కేడబ్ల్యు సామాన్య చార్జింగ్ పాయింట్‌లు ఉన్నాయి. ఇంటిగ్రేటెడ్ వ్యవస్థలో తలా రెండు 45 కేవీ సామర్థ్యం కల్గిన 2లైఫ్ బ్యాటరీలు పగలు సౌరశక్తిని స్వీకరించి, రాత్రి వినియోగించుకునేలా చేయడం ద్వారా ఇక్కడ 24 గంటలూ చార్జింగ్‌కు వీలు కల్పిస్తున్నారు. దీనికితోడు సెకండ్‌లైఫ్ కార్ బ్యాటరీలు కూడా సౌరశక్తిని సంగ్రహించేలా ఉపయోగించదలిచినట్లు బెస్కాం అధికారులు తెలిపారు. పెరుగుతున్న విద్యుత్ చార్జీలతో వాహనదారులు ఎలక్ట్రిక్ వాహనాలపై ఆసక్తి చూపుతున్నారని, మున్ముందు ఈవీ చార్జింగ్ పాయింట్లకు డిమాండ్ మరింత పెరగనుందన్నారు.


హబ్ నిర్మాణ పనుల్లో కార్మికులు

పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం

విమానాశ్రయ ఆవరణలో ఈవీ చార్జింగ్ పాయింట్‌లు ఉన్నా అవి విమానాశ్రయ వాహనాలకు మాత్రమే పరిమితం అయ్యాయి. ప్రైవేట్ ఏజెన్సీలు తమ వాహనాలకు రెండు చార్జింగ్ పాయింట్‌లు ఏర్పాటు చేసినా అవి సాధారణ ప్రజలకు అందుబాటులో లేవు. విమానాశ్రయానికి నిత్యం వేలాది వాహనాలు వస్తున్నా వీటి చార్జింగ్ కోసం వేరే ప్రాంతానికి తీసుకెళ్లాల్సి వస్తోంది. ఈ సమస్యను అధిగమించేందుకు విమానాశ్రయ పార్కింగ్ నుంచి కేవలం 1.5 కిలోమీటరు దూరంలో బెస్కాం 224 కేవీ పవర్‌స్టేషన్ ప్రాంతంలో సోలార్ చార్జింగ్ సెంటర్ నిర్మిస్తున్నట్లు బెస్కాం అధికారులు వెల్లడించారు.


కెంపేగౌడ విమానాశ్రయం

2500 సెంటర్లకు టెండరు ప్రక్రియ

రానున్న రోజుల్లో ఎలక్ట్రిక్ వాహనాల వాడకం మరింత పెరగనుంది. వీటిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా ఈవీ చార్జింగ్ సెంటర్లను ప్రారంభించేందుకు విద్యుత్‌శాఖ మంత్రి ఆసక్తిగా ఉన్నారు. దేవనహళ్ళిలో భారీ స్థాయిలో ఈవీ చార్జింగ్ హబ్ నిర్మాణం అవుతోంది. సెప్టెంబరు చివరినాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని బెస్కాం ఎండీ మహంతేశ్ బీళగి తెలిపారు. దేశంలో అత్యధికంగా 4.80 లక్షల ఎలక్ట్రిక్ వాహనాలు కర్ణాటకలోనే ఉన్నాయని వీటికి 5,765 చార్జింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. వీటిలో 4,462 కేంద్రాలు బెంగళూరు నగర పరిధిలోనే ఉన్నాయన్నారు. బెంగళూరు సహా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 2,500 ఈవీ చార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు టెండరు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. వాహనాల ధరలు మధ్యతరగతికి అందుబాటులో ఉండడంతో వాడకం మరింత పెరగనుంది.




చార్జింగ్ హబ్ ప్రత్యేకతలు

విమానాశ్రయం సమీపంలో నిర్మించనున్న చార్జింగ్ హబ్‌లో పలు ప్రత్యేకతలున్నట్లు బెస్కాం అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ కేంద్రం మొత్తం సామర్థ్యం 400 కిలోవాట్‌లుగా ఉంది. ఇందులో 81 భారీ సోలార్‌ప్యానెల్స్ అమరుస్తున్నారు. సౌరశక్తి సదుపాయం కారణంగా పగలు చార్జింగ్ అయిన ప్యానెల్స్ రాత్రి కూడా విద్యుత్ సరఫరా అందజేస్తాయి. 24/7 అంటే నిరంతరం ఇక్కడ చార్జింగ్‌కు వీలుంది. 560 చదరపు మీటర్ల ప్రదేశంలో హబ్ ఏర్పాటవుతోంది. ఇటీవల విమానప్రయాణికుల సంఖ్య భారీగా పెరుగుతూ ఉంది. ఇక్కడికి వచ్చే వాహనాలకే కాకుండా సమీపంలో వెళ్లే పలు వాహనాలకు ఈ కేంద్రంలో చార్జింగ్ సదుపాయం కల్పించనున్నారు.




రాజ్యోత్సవం నాటికి.. రెడీ.!

- బళ్లారిలో సిద్ధమవుతున్న వంద అడుగుల క్లాక్‌టవర్


నిర్మాణంలో ఉన్న క్లాక్‌టవర్

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 24: నగరానికి ఐకాన్‌గా నిలిచిపోనున్న క్లాక్‌టవర్ నిర్మాణ పనులు చకాచకా సాగుతున్నాయి. అన్నీ సవ్యంగా జరిగితే కర్ణాటక రాష్ట్ర అవతరణ దినోత్సవం, నవంబరు 1వ తేదీన క్లాక్‌టవర్ ప్రారంభానికి సన్నాహాలు సాగుతున్నాయి. నగరంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 100 అడుగుల క్లాక్‌టవర్ నిర్మాణ పనులు 2022 ఆగస్టు నెలలో ప్రారంభం అయ్యాయి. గత ఏడాది రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటుతో నిర్మాణ పనులు కొన్ని నెలలపాటు ఆగిపోయాయి. వివిధ సంఘాల ఆందోళన కారణంగా తిరిగి క్లాక్‌టవర్ నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో తిరిగి ప్రారంభం అయ్యాయి. జిల్లా అభివృద్ధికి అక్షయ పాత్రగా ఉన్న జిల్లా ఖనిజ నిధి(డీఎంఎఫ్)నిధులు రూ.5కోట్ల రూపాయలకు పైగా వెచ్చించి నిర్మిస్తున్న ఈ క్లాక్ టవర్‌ను మొదట్లో 120 అడుగుల ఎత్తు నిర్మించాలని ప్రతిపాదన ఉండేది. అయితే క్లాక్ టవర్ చుట్టూ అవసరమైన స్థలం లేని కారణంగా క్లాక్‌టవర్‌ను 100 అడుగులకు తగ్గించారు. ప్రస్తుతం నిర్మాణం అవుతున్న టవర్‌పై నాలుగు నాలుగు సింహాల అశోక స్తూపాన్ని ఏర్పాటు చేయడం గమనార్హం. క్లాక్ టవర్ నుంచి సంఘం సర్కిల్ వరకు గల 450 మీటర్ల రోడ్డు వెడల్పులో ఏర్పడిన సాంకేతిక పరమైన సమస్యల కారణంగా టవర్ క్లాక్ నిర్మాణం ఆలస్యమైందని తెలుస్తోంది. ప్రజా పనుల శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ బృహత్ క్లాక్‌టవర్ దేశంలో ఏ నగరంలో లేని స్థాయిలో రూపుదిద్దుకోవడం గమనార్హం. క్లాక్‌టవర్ నుంచి 450మీటర్ల రోడ్డును 22 మీటర్ల వెడల్పుతో ఆధునాతన రీతిలో నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణానికి రూ.6కోట్ల రూపాయల మేర ఖర్చు చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఆకర్షణీయమైన విద్యుత్ దీపాల ఏర్పాటు క్లాక్‌టవర్‌కు మరింత హంగును తీసుకొచ్చే రీతిలో ప్రజా పనుల శాఖ అధికారులు కృషి చేస్తుండడం గమనార్హం. కర్ణాటక రాజ్యోత్సవం రోజున 450మీటర్ల రోడ్డుకు, క్లాక్ టవర్‌ను ప్రారంభించే అవకాశం ఉంది. ఈ రెండు నిర్మాణాలు బళ్ళారి నగరానికి మరింత సౌందర్యాన్ని తీసుకొస్తుందని నగర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అభిమన్యును తూకం వేస్తున్న అధికారులు

అభిమన్యు @ 5,560 కేజీలు

- మైసూరుకు చేరుకున్న గజరాజులు
- బరువు తూచిన అధికారులు

బెంగళూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అభిమన్యు నేతృత్వంలోని 9 గజరాజులు మైసూరు ప్యాలెస్‌కు శనివారం ఉదయం చేరుకున్నాయి. మంత్రులు, అధికారులు ఏనుగుకుఉ ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే తన్వీర్‌సేఠ్, అటవీశాఖ అధికారులు, మైసూరు ప్యాలెస్ ప్రముఖులు ఇందులో పాల్గొన్నారు. గజరాజులకు శిక్షణ ఇచ్చే ముందు వాటి బరువు తూచడం ఆనవాయితీ. బరువు ఆధారంగా వాటికి తగిన ఆహారం అందజేస్తారు. గజరాజులను భారీ కాటా వద్దకు తీసుకెళ్లి తూకం వేశారు. నాడదేవత చాముండేశ్వరి దేవి 750 కేజీల బంగారు అంబారీని మోసే గజరాజు అభిమన్యు బరువు 5,560 కిలోలుగా ఉంది. భీముడు (4,945 కేజీలు), ఏకలవ్య (4,730 కేజీలు), కంజన్ (4,515 కేజీలు), ధనంజయ (5,175 కేజీలు), లక్ష్మి (2,480 కేజీలు), వరలక్ష్మి (3,495 కేజీలు), రోహిత్ (3,625 కేజీలు), గోపి 4,970కేజీలుగా ఉంది. కవాతు జరిగే ముందు రోజు మళ్లీ గజరాజులకు తూకం వేయనున్నారు. ఆదివారం నుంచి ప్రతిరోజూ గజరాజులకు శిక్షణ ఇవ్వనున్నారు. మైసూరు డీజివిన్ అటవీ అధికారి ఐబీ ప్రభుగౌడ తదితరులు గజరాజుల తూకాన్ని పరిశీలించారు.


ప్యాలెస్‌కు తరలి వెళ్తున్న గజరాజులు

కుల వ్యవస్థతోనే విద్యకు దూరం

- అసమానతతో కొన్నివర్గాలకు తీరని అన్యాయం : సీఎం సిద్దరామయ్య విచారం

బెంగళూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సమాజంలో కులమతాల కారణంగానే అసమానత పెరిగిందని, దీని కారణంగానే చాలా వర్గాల ప్రజలు విద్యకు దూరమవుతున్నారని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. నగరంలోని గాంధీభవన్‌లో శనివారం 'గాంధీ స్మారకనిధి' సంస్థ 75వ వార్షికోత్సవంలో భాగంగా 21వ శతాబ్దానికి మహాత్మాగాంధీజీ అనే అంశంపై అంతర్జాతీయ చర్చాగోష్టిని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గాంధీజీ ఆశయాలు సమాజానికి ఇచ్చిన మార్గదర్శకాలు 20వ శతాబ్దానికే పరిమితం కాలేదని, నేటి కాలానికీ అన్వయిస్తాయన్నారు. గాంధీజీ శాంతి, సత్యం, న్యాయం సౌభ్రాతృత్వం వంటివి ఆచరించి చూపారన్నారు. ఆయన ఆశయాలు దేశానికే కాక ప్రపంచానికి కూడా ఆదర్శంగా ఉన్నాయన్నారు. మానవుల మధ్య పరస్పర స్నేహభావం పెరగాలని, అశాంతి తగ్గాలన్నారు. మనిషి తన ప్రశాంతతకోసం వేరే గ్రహాలను వెదుక్కుంటే దొరకదన్న స్టీఫెన్ హాకింగ్ మాటలను ఆయన గుర్తు చేశారు. పరిస్థితుల్లో మార్పు రాకుంటే కువెంపు ఆశించిన విశ్వమానవ ఆశయం ఫలించదన్నారు. అన్నీ ఇస్తున్న ప్రకృతిని దురాశతో చేతులారా నాశనం చేసుకోరాదన్నారు. కొన్నిచోట్ల విద్యావంతులే మూఢనమ్మకాలను పాటిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. 850 ఏళ్లక్రితం బసవణ్ణ, తదితర శరణులు కర్మసిద్ధాంతాన్ని తిరస్కరించారని అయినప్పటికీ నేటికీ కొంతమంది అనుసరించడం విచారకరమన్నారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శాస్త్రీయ మార్గంలో సమాజాన్ని ప్రగతిదిశగా మార్చేందుకు కృషి చేశారన్నారు. అందరినీ పరిగణనలోకి తీసుకునే గాంధీజీ అహింసా మార్గం నేటి యువతకు చేరాలన్నారు. దేశంలో 85శాతం ఆస్తులు ఒకశాతం ఉన్న శ్రీమంతుల చేతుల్లో ఉన్నాయని, ఆర్థిక అసమానత తొలగేందుకు గాంధీజీ సిద్ధాంతాలు మార్గదర్శకం కానున్నాయన్నారు. మహాత్మాగాంధీ అధ్యక్షత వహించిన కాంగ్రెస్ బెళగావి సమావేశం శతమానోత్సవాన్ని అర్థవంతంగా ఆచరించనున్నట్లు తెలిపారు. గాంధీజీ కలలు గన్న గ్రామస్వరాజ్యం నెరవేరాల్సి ఉందని, గాంధీజీ ఆశయం మేరకు అర్ధరాత్రి స్త్రీ నిర్భయంగా సంచరించాల్సి ఉందన్నారు. కార్యక్రమానికి గాంధీ స్మారకనిధి అధ్యక్షుడు రామచంద్ర రాహి అధ్యక్షత వహించగా న్యాయ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్, కార్యాధ్యక్షుడు విశుకుమార్, న్యూఢిల్లీ స్మారక నిధి అధ్యక్షుడు సంజోయ్‌సింగ్ పాల్గొన్నారు.


గాంధీ స్మారకనిధి వార్షికోత్సవంలో సీఎం సిద్దరామయ్య తదితరులు


సభ్యత్వ నమోదులో ప్రథమ స్థానమే లక్ష్యం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

బెంగళూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పార్టీ సభ్యత్వ నమోదులో బీజేపీని ప్రపంచంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలపడమే లక్ష్యమని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర పేర్కొన్నారు. నగరంలోని ప్యాలెస్ మైదానంలో శనివారం ఏర్పాటైన సభ్యత్వ నమోదు అభియాన రాష్ట్రస్థాయి సమావేశాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయేంద్ర మాట్లాడుతూ బూత్‌స్థాయిలో ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు చేసేలా కార్యకర్తలు శ్రమించాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే అత్యధిక సభ్యులు కలిగిన పార్టీగా తీర్చే సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ సందర్భంగా శాసనసభ ప్రతిపక్షనేత ఆర్ అశోక్, పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి, జాతీయ కార్యదర్శి రితురాజ్ సిన్హా, రాష్ట్ర సహ ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి డాక్టర్ అశ్వత్థనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సునిల్‌కుమార్, నందీశ్‌రెడ్డి, పి రాజీవ్, ప్రీతంగౌడ, శాసనసభ ప్రతిపక్ష చీఫ్‌విప్ దొడ్డనగౌడ పాటిల్, ఎమ్మెల్సీ ప్రతాప్‌సింహనాయక్, ఎంపీలు, ఎమ్మెల్యేలు పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు సమావేశాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేత అశోక్ తదితరులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1627.54	1,626.61
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	31,723	2,032
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9830	10,208
సామర్థ్యం (టీఎంసీలు)	85.11	81.88

పెండింగ్ కేసులను పరిష్కరించుకోవాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి శాంతి

బళ్లారి సిటీ, ఆగస్టు 24:ఎన్నో ఏళ్లనుంచి పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవాలని ప్రధాన జిల్లా సెషన్స్ న్యాయాధికారి కే.జి.శాంతి విజ్ఞప్తి చేశారు. నగరంలోని తాళూరురోడ్డులోని కొత్త కోర్టు కాంప్లెక్స్ హాల్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్వరన్యాయం కోసం పార్టీలకతీతంగా లోక్‌అదాలత్‌లో పాల్గొని పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీద్వారా పరిష్కరించుకుని సామరస్యపూర్వక జీవనం సాగించాలన్నారు. ప్రజలు తమ ముందస్తు లిటిగేషన్, చెక్‌బౌన్స్ కేసు. బ్యాంక్ కేసు, మోటారు వాహన ప్రమాద పరిహారం తదితర కేసులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మ్యాట్రిమోనియల్ ఫ్యామిలీ కేసులు, సివిల్ కేసులు, ఇతర కేసులు కూడా ఈ మెగా లోక్ అదాలత్‌లో పరిష్కారమవుతాయన్నారు. బళ్లారి, విజయనగరం జిల్లాలోని 31 కోర్టుల్లో పెండింగ్‌లోఉన్న 59,434కేసుల్లో 4,109 కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కారమవుతాయని గుర్తించారు. ప్రతిరోజు అన్ని కోర్టుల్లో మెగా లోక్‌అదాలత్‌ను ఉద్దేశించి న్యాయమూర్తులు, న్యాయసేవాధికారుల సమక్షంలో కోర్టు అధికారులు, మధ్యవర్తులు కేసుల పరిష్కారానికి పార్టీలను ఒప్పిస్తున్నారన్నారు. గతలోక్‌అదాలత్‌లో మంచి స్పందన వచ్చిందన్నారు. రాబోయే రాష్ట్రీయ లోక్ అదాలత్‌లో మరిన్ని లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ రాజేశ్ హొసమనె పాల్గొన్నారు.

సండూరు అడవిని రక్షించాలి



సండూర్‌లోని అటవీ ప్రాంతం

బళ్లారి సిటీ, ఆగస్టు 24:సండూర్ తాలూకాలోని సహజ అటవీ ప్రాంతాన్ని రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని ఇటీవల కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. విజయనగరం జిల్లా కొట్టూరు తాలూకాకు చెందిన డాక్టర్ సదానంద హెగ్గడాల్ మఠం, దేవదారి, హద్దినపాడు, కమటూరు రేంజ్‌తో సహా సండూర్‌లోని మొత్తం అరణ్యాలను రక్షించాలని జూలై 7న వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రపతి ఆదేశాల మేరకు కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టుకు లేఖ రాసింది. ఇందులో సదానంద లేఖను పరిశీలించి తీసుకున్న చర్యల గురించి దరఖాస్తుదారుకు తెలియజేయాలని పేర్కొంది. ఈ మేరకు కుద్రేముఖ్ ఐరన్ కంపెనీ సండూర్‌లోని దేవదారి వద్ద మైనింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేసింది. ఇదే కంపెనీ హద్దినపాడు అటవీ పరిధిలో ఖనిజాన్వేషణ కొనసాగిస్తోంది.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు



అదృశ్యమైన కేశవరెడ్డి

బళ్లారి రూరల్, ఆగస్టు 24 : బళ్లారి తాలుకాలోని జాలిహాళ్ గ్రామానికి చెందిన కేశవరెడ్డి (70) ఈ నెల 19వ తేదీన ఇంటి నుండి బయటకు వెళ్లి రాకపోవడంతో కుటుంబీకులు మోకా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కనిపించకుండా వెళ్లిన వ్యక్తి 5.2 అడుగుల ఎత్తు వుంటాడని, కన్నడ, తెలుగు మాట్లాడగలడని, తెల్లని వెంట్రుకలు కలవని ఆచూకీ తెలిసిన వారు 08392-258100, 9280803021, 9480803050 నెంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జయ హనుమాన జ్ఞానగుణసాగర...

శ్రావణ శనివారం సందర్భంగా భక్తులతో పోటెత్తిన ఆంజనేయ ఆలయాలు

వెంకటేశ్వరనగర్‌లో..



సింధూర అలంకరణలో వరదాంజనేయస్వామి

బళ్లారిరూరల్, ఆగస్టు 24 : బళ్లారి నగరం వెంకటేశ్వరనగర్‌లో వెలిసిన శ్రీ వరద అభయాంజనేయస్వామికి మూడవ శనివారం సందర్భంగా సింధూర అలంకరణ చేశారు. శ్రావణ మాసం మూడవ శనివారం కావడంతో స్వామివారికి విశేష పూజలు చేపట్టారు. పంచామృతాభిషేకం, అష్టోత్తర పూజ చేసి దర్శనం ప్రారంభించారు. నగరంలో మహిళలు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు ధనుంజయ తెలిపారు.

కంప్లిలో..



కంప్లిలో స్వామికి పండ్లతో ప్రత్యేక అలంకరణ

కంప్లి, ఆగస్టు 24 : శ్రావణ మూడవ శనివారం సందర్భంగా పలుచోట్ల ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. కంప్లి, కురుగోడు, కుడితిని తదితర గ్రామాలు, పట్టణాలలో ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం స్వామివారికి జలాభిషేకం, అమృతాభిషేకం చేపట్టారు. అలాగే కంప్లి పట్టణంలో క్షత్రియ సమాజం ఆధ్వర్యంలో మూడవ శనివారం సందర్భంగా తుంగభద్ర నదిలో పూజలు చేసి అక్కడి నుంచి ఆలయం వరకు స్వామివారిని ఊరేగించారు.

మరూరులో..



మరూరు ఆంజనేయస్వామి

బళ్లారిరూరల్, ఆగస్టు 24 : తాలుకాలోని మోకా సమీపంలో గల మరూరు ఆంజనేయస్వామి ఆలయంలో మూడవ శనివారం సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ కార్యక్రమాలు జరిపారు. ఉదయాన్నే అభిషేకం, అర్చన, విశేష పూజలు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు అర్చకులు తమన్న తెలిపారు. ఈ పూజల్లో చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

నేమకల్లులో..



సర్వాలంకారాలతో నేమకల్లు అంజనీసుతుడు

బొమ్మనహాళ్, ఆగస్టు 24 : అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామిని శ్రావణమాసం మూడవ శనివారం సందర్భంగా వేలాది మంది దర్శించుకున్నారు. స్వామివారికి అష్టోత్తర పూజ నిర్వహించి తులసీదళాలతో విశేషంగా అలంకరణ చేసి నైవేద్యం సమర్పించిన అనంతరం మహామంగళహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా కర్ణాటకలోని కంప్లి, బళ్లారిరూరల్ మాజీ ఎమ్మెల్యేలు సురేష్‌బాబు, గాలి సోమశేఖర్‌రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు.

అలరించిన హనుమాన్ భక్తుల బైక్ ర్యాలీ



బైక్‌ర్యాలీలో పాల్గొన్న హనుమాన్ భక్తులు

బళ్లారి సిటీ, ఆగస్టు 24: శ్రావణ మూడవ శనివారం సందర్భంగా బళ్లారి నగరంలో శనివారం ఎక్కడచూసినా భజరంగ ధ్వనులు మారుమ్రోగాయి. సాయంత్రం బైక్‌ర్యాలీ నిర్వహించారు. నగరంలోని కేఈబీ సర్కిల్లో శనివారం బైక్‌ర్యాలీని గనుల ఉద్యమకారులు ఎస్‌కే మంజు మోది ప్రారంభించి మాట్లాడారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా బైక్ ర్యాలీ నిర్వహించామన్నారు. మాల ధరించి ఇక్కడికి విచ్చేసిన హనుమాన్ భక్తులకు మంచి జరుగాలని కోరుకుంటున్నామన్నారు. బీజేపీ సిటీ అధ్యక్షులు మోకా అనిల్ కమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మూడు ఉద్దేశాలతో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం, గోహత్య నిషేదం, మతమార్పిడులకు వ్యతిరేకంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిటీ మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఈరోజుఐదు నదుల నీటితో ఆంజనేయస్వామి విగ్రహానికి జలాభిషేకం నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ బైక్‌ర్యాలీలో పాల్గొని హనుమాన్ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఈసందర్భంగా కామినేని అరుణా, డా. సుందర్‌మూర్తి, రామచంద్రప్ప, మల్లనగౌడ, శ్రీనివాస్ మోత్కార్, మాజి బుడా అధ్యక్షులు మారుతీ ప్రసాద్, రుద్రప్ప పాల్గొన్నారు.

తుంగభద్ర డ్యాంకు పూర్వవైభవం

- 85 టీఎంసీలకు చేరిన నీటిమట్టం
- నిలకడగా కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



బళ్లారి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం మరలా వరదనీటితో కళకళలాడుతోంది. టీబీ డ్యాం అధికారులు శనివారం నీటిలెక్కలు వేసే సమయానికి డ్యాంలో 85.113 టీఎంసీల నీరు చేరింది. ఇన్‌ఫ్లో కూడా నిలకడగా ఉంది. ఈనెల 10న డ్యాం క్రస్ట్ గేటు కొట్టుకుపోవడంతో క్రస్ట్ గేటు స్థానంలో తాత్కాలిక స్టాప్‌లాగ్ ఎలిమెంట్ అమర్చిన విషయం విదితమే. ఈ ఆరురోజుల్లోనే దాదాపు 15 టీఎంసీల నీరు డ్యాంలోకి చేరాయి. డ్యాం పై భాగంలో ఇంకా వర్షాలు కురుస్తున్నాయి. డ్యాంలో పెద్దమొత్తంలో నీరు చేరడంతో రైతుల్లోనూ, అధికారుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. క్రస్ట్ గేటు తెగిపోయి నీరు నదిలోకి వెళ్లిపోతున్న సమయంలో డ్యాం ప్రాంతం నిర్మానుష్యంగా ఉండేది. ఇప్పుడు మరలా నీటి అలల సవ్వడి నెలకొంది. ప్రస్తుతం ఖరీఫ్, రబీకి సాగునీటి ఇబ్బంది ఉండదనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

టెక్కలకోట పంచాయతీ అధ్యక్షుడిగా ఆనంద్



గెలుపొందిన అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

సిరుగుప్ప, ఆగస్టు 24 : లాటరీ ద్వారా టెక్కలకోట పట్టణ పంచాయతీ అధ్యక్షులుగా ఆనంద్ ఎన్నికయ్యారు. సిరుగుప్ప తాలుకాలోని టెక్కలకోట పట్టణ పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు ఎన్నికలఅధికారి విశ్వనాథ్ ఆధ్వర్యంలో శనివారం జరిగాయి. ఈ పట్టణ పంచాయతీ 20 వార్డుల్లో బీజేపీకి 11 మంది కౌన్సిలర్లు ఉండగా, కాంగ్రెస్ పార్టీకి తొమ్మిది మంది సభ్యులే కాకుండా ఎంపీ, ఎమ్మెల్యేలతో కలసి 11 మంది వున్నారు. అధ్యక్ష పదవికి ఆనంద్ నామినేషన్ దాఖలు చేయగా బీజేపీ నుంచి మరొకరు నామినేషన్ దాఖలు చేశారు. ఇరువురికి చెరో 11 ఓట్లు పడ్డాయి. దీంతో ఎన్నికల అధికారి లాటరీ వేశారు. అందులో కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ ఆనంద్ గెలుపొందాడు. ఈ సందర్భంగా ఎంపీ రాజశేఖర్ ఇత్నాల్, ఎమ్మెల్యే బీఎం నాగరాజు గెలుపొందిన అభ్యర్థి ఆనంద్‌ను, ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన రుద్రమ్మను పూలమాలతో సన్మానించారు. ఎంపీ, ఎమ్మెల్యే ఆలస్యంగా రావడంతో మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప లోపలికి వెళ్లకూడదని వారిని అడ్డుకున్నారు. తహసీల్దార్ జోక్యం చేసుకుని ఎన్నికల అనంతరం పూర్తి పరిష్కారం కోసం కోర్టును ఆశ్రయించవచ్చునని తెలపడంతో వివాదం సద్దుమణిగింది.

నిండుకుండలా దరోజీ చెరువు



మరువ పారుతున్న దరోజీ చెరువు

కంప్లి, ఆగస్టు 24 : జిల్లాలోనే అతిపెద్దదైన దరోజీ చెరువు పూర్తిగా నిండి మరవ పారుతోంది. నీరు చెరువు నుంచి కింది భాగానికి పారుతుండటంతో జలపాతంగా మారింది. దీంతో ఈ ప్రాంతానికి పర్యాటకులు ఎక్కువగా పోటెత్తుతున్నారు. బళ్లారి, తోరణగల్లు, సండూరు, కంప్లి, కురుగోడు నుంచి కూడా ఎక్కువ మంది పర్యాటకులు వచ్చి కోడి వీరభద్రేశ్వర స్వామిని దర్శించుకుని చెరువును సందర్శిస్తున్నారు. ఈ యేడాది దరోజీ చెరువు నీటితో నిండి పోటెత్తడంతో పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

రక్తదానం.. మహాదానం



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు ఇస్తున్న ప్రముఖులు

కంప్లి, ఆగస్టు 24: అన్ని దానాలకన్నా రక్తదానం ఎంతో గొప్పదని డాక్టర్ రేవణ సిద్దయ్య తెలిపారు. ఇటిగి గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 96 మంది రక్తదానం చేశారు. స్వామి వివేకానంద సంఘం ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు. ప్రతి ఒక్కరికి చెడు అలవాట్ల వల్ల ఆరోగ్యం నశించి పోతోందని, ఆరోగ్యం పెంపొందించుకోవడం కోసం యోగా, ధ్యానం, వాకింగ్ తదితరాలు చేపట్టాలన్నారు. 18 నుంచి 40 సంవత్సరాలలోపు మూడు నెలలకొకసారి రక్తదానం చేపట్టవచ్చునన్నారు. ప్రతిఒక్కరు ఇలాంటి కార్యక్రమాలకు ముందుకు రావాలని సూచించారు. అనంతరం సర్టిఫికెట్లు అందించారు. వారితో పాటు ఈ కార్యక్రమంలో పరమేష్ స్వామి, శరణప్ప, అనుమేష్, బసవరాజు, హనుమంతు, ప్రశాంత్, వీరేష్, మాలకొండయ్య, నాగరాజు పాల్గొన్నారు.

సకాలంలో ఆస్తి పన్నులు చెల్లించాలి



నోటీసులు ఇస్తున్న అధికారులు

సిరుగుప్ప, ఆగస్టు 24: సకాలంలో ఆస్తి పన్నులు చెల్లించాలని నగరసభ రెవెన్యూ అధికారి రాజబక్షి నగర ప్రజలకు తెలిపారు. పట్టణంలో శనివారం రెవెన్యూ అధికారులు ఇంటింటికి తిరుగుతూ ఆస్తి పన్నులు చెల్లించాలని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆస్తి పన్ను చెల్లిస్తే నగర అభివృద్ధికి నిధులు వినియోగిస్తామని తెలిపారు.

హోసూరు జోన్

వైభవంగా మత్తిగిరి కోటమారియమ్మ కుంభాభిషేకం



పూజలందుకుంటున్న మత్తిగిరి కోటమారియమ్మ

హోసూరు, ఆగస్టు 24: హోసూరు ప్రాంతంలోని మత్తిగిరి కోటమారియమ్మ ఆలయ కుంభాభిషేకం శనివారం వైభవంగా జరిగింది. ఐటీఐ సమీపంలోని వెలసిఉన్న కోటమారియమ్మ ఆలయ గోపురం పనులు కొన్నినెలలుగా కొనసాగుతున్నాయి. పనులుపూర్తయిన నేపథ్యంలో బుధవారం నుంచి కుంభాభిషేకం పనులు ప్రారంభించారు. బుధవారం ఉదయం 6 గంటలకు తొలి కాల యాగ పూజా కార్యక్రమాలు ప్రారంభం కాగా వాస్తు శాంతి, తొలి కాల యాగ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం రెండోరోజు యాగపూజ చేసి, మూడో రోజైన శుక్రవారం ఉదయం 6 గంటలకు కళశాన్ని స్థాపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వాసుదేవన్, కార్యదర్శి రవికుమార్, నిర్వాహకులు, బీరప్ప, మారప్ప, సుమన్, మునిరాజ్, ఉమాశంకర్, శ్రీనివాసన్, నాగరాజ్, నారాయణస్వామి, నారాయణన్, నవీన్, రవి, ప్రకాశ్, శివన్న, హేమంత్‌కుమార్, జానకీరామన్, రమేశ్, శ్రీనివాసన్, కేఅప్పారావ్, దయాళన్, ప్రాంత ప్రజలు పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం నిర్వాహకుల ఎంపిక

హోసూరు, ఆగస్టు 24: ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ పునర్నిర్మాణ కార్యక్రమం జరిగింది. శనివారం ఆర్.వి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల తల్లితండ్రులకు అధికారికంగా ఆహ్వానించి నిర్వాహకులను ఎన్నుకున్నారు. జిల్లా ప్రాథమిక విద్యాధికారి మునిరాజ్ ప్రత్యేక సందర్శకుడిగా హాజరయ్యారు. పాఠశాల ప్రిన్సిపాల్ మునిరాజ్ అందరికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో తల్లితండ్రులు, పూర్వ విద్యార్థులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మెన్, వైస్ చైర్మెన్, సభ్యులను పూర్వ విద్యార్థులు , ప్రజాప్రతినిధులు, స్థానిక కౌన్సిల్ ప్రతినిధులు, ఉపాధ్యాయ ప్రతినిధి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమం ముగింపులో పేరెంట్స్, టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సెందిల్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

వెంకటాచలపతికి శ్రావణ శనివార పూజలు

హోసూరు ఆగస్టు 24: శ్రావణ మాస మూడో శనివారాన్ని కన్నడ, తెలుగు ప్రజలు హోసూరు ప్రాంతంలో ఘనంగా జరుపుకున్నారు. హోసూరు పరిసర ప్రాంతాల్లోని ప్రజలు వెంకటాచలపతి, కృష్ణ, రామ, ఆలయాలను దర్శించి ఎక్కువ సంఖ్యలో స్వామి వారి దర్శనం చేసుకున్నారు. తెల్లవారుజామున స్వామి దర్శనం చేసుకుని పూజలు నిర్వహించుకున్నారు. తమిళనాడు, కర్ణాటకకు చెందిన ప్రజలు తమ తమ ఇంటిదేవుడని వచ్చి పూజలు నిర్వహించుకున్నారు. దక్షిణ తిరుపతి ఆలయంలో కూడా ఘనంగా పూజలు జరిగాయి. వచ్చిన భక్తాదులందరికి తీర్థ ప్రసాదాలు అందించారు. అదేవిధంగా వెంకటేశ్ నగర్‌లోని వెంకటాచలపతి, ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు హోసూరు చుట్టు ప్రాంతాల నుంచి ఎక్కువ సంఖ్యల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.



అలంకృతుడైన వెంకటాచలపతి స్వామి

ఎయిర్‌పోర్ట్ పనుల ప్రారంభానికి సత్వర చర్యలు

- మంత్రి ఎన్ఎస్ భోసరాజు



సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఎంబీ పాటిల్, భోసరాజు

రాయచూరు, ఆగస్టు 24: రాయచూరు విమానాశ్రయ నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించేందుకు కావల్సిన చర్యలు తీసుకోవల్సిందిగా జిల్లాకు చెందిన చిన్ననీటిపారుదల శాఖ మంత్రి భోసరాజు అధికారులను కోరారు. విమానాశ్రయ నిర్మాణ అంశానికి సంబంధించి శనివారం బెంగళూరులోని విధానసౌధలో భారీ మధ్యతరహా పరిశ్రమల మంత్రి ఎంబీ పాటిల్ సమక్షంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పాటిల్‌తో పాటు రాయచూరు లోకసభ సభ్యుడు జీ కుమార్ నాయక్, జిల్లాధికారి నితీశ్, మౌలిక సౌకర్యాల అభివృద్ధి మండలి డైరెక్టర్ జోష్ణ చౌదరి తదితరులు పాల్గొన్నారు. విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే భూసేకరణ పూర్తయినందున సాంకేతికంగా ఎదురయ్యే సమస్యల గురించి అధికారులను మంత్రులు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వానికి పూర్తి నివేదికను అందజేసి త్వరితగతిన అనుమతి లభించేలా చర్యలు తీసుకునేందుకు కావల్సిన కార్యచరణ సిద్ధం చేయాలని మంత్రులు కోరారు. త్వరలోనే అనుమతి లభించనున్నట్లు మంత్రులు ఆశాభావం వ్యక్తం చేశారు.

కోల్‌కతా ఘటనపై మౌన ప్రదర్శన




డీసీ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాయచూరు, ఆగస్టు 24 : కోల్కత్తాలో వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనకు వ్యతిరేకంగా శనివారం నగరంలో భారీ మౌన నిరసన ప్రదర్శన నిర్వహించారు. వివిధ ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పలు రాజకీయ పార్టీల మహిళ సంఘాలు ఏకమై నిర్వహించిన ఈ ప్రదర్శనలో వేలాది మంది స్వచ్ఛందంగా పాల్గొన్నారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి ఎల్ఐసీ కార్యాలయం, బసవేశ్వర సర్కిల్ మీదుగా జిల్లాధికారి కార్యాలయం వరకు సాగిన మౌన ప్రదర్శనలో పాల్గొన్నవారు దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ జిల్లాధికారి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

చట్టాంపి స్వామిగల్ (జయంతి)



సన్యాసి అయినా సంఘసంస్కర్తగా గుర్తింపు పొందిన చట్టాంపి స్వామిగల్ 1853 ఆగస్టు 25న కేరళ రాష్ట్రం త్రివేండ్రంలోని కొల్లూరు ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు అయ్యప్పన్ పిళ్ళై. హిందూధర్మ ఉద్ధరణకోసం పాటుపడ్డారు. ప్రత్యేకించి అద్వైత వేదాంతంలో రాణించారు. ఆధ్యాత్మిక బోధనలతో ఆకట్టుకున్నారు. భజనలు, వ్యాసాలు, చరిత్ర, భాష, ఆధ్యాత్మికంపై ఎన్నో రచనలు చేశారు. శాకాహారం, అహింస విధానాలు ఆచరించి ప్రోత్సహించారు. ఆయన రచనల్లో 'వేదాదికార నిరూపణం' ఎంతో పేరొందింది. కొన్ని రచనలు మరణించిన 8 దశాబ్దాల అనంతరం ప్రచురితం కావడం విశేషం. 1924 మే 5న కన్నుమూశారు.

కిరుపానంద వారియర్ (జయంతి)



తిరుమురుగ కిరుపానంద వారియర్ 1906 ఆగస్టు 25న తమిళనాడు రాష్ట్రం వేలూరులో జన్మించారు. ఆధ్యాత్మికవేత్తగా, ఉపాధ్యాయుడిగా పేరొందారు. 64వ నాయనార్‌గా పరిగణిస్తారు. మురుగన్ భక్తుడిగా రాష్ట్రవ్యాప్తంగా పలు ఆలయాల జీర్ణోద్ధరణకు కృషి చేశారు. 'ఇసై పెరారిగ్నర్' అనే బిరుదు పొందారు. కళైమామణి, ప్రవచన సామ్రాట్ తదితర పురస్కారాలు అందుకున్నారు. 1993 నవంబరు 7న కన్నుమూశారు. 2006లో ఆయన జ్ఞాపకార్థం పోస్టల్ స్టాంప్ విడుదల చేశారు.

దేవులపల్లి రామానుజరావు (జయంతి)



ఆంధ్ర సాహిత్య, సాంస్కృతిక ఉద్యమ నిర్మాతగా పేరొందిన డాక్టర్ దేవులపల్లి రామానుజరావు 1917 ఆగస్టు 25న వరంగల్లు పట్టణ సమీపాన దేశాయిపేట ప్రాంతంలో జన్మించారు. పాత్రికేయుడిగా, సంపాదకులుగా రాణించారు. తెలంగాణ విముక్తి పోరాటంలో అక్షరాన్ని ఆయుధంగా చేసుకుని పోరాడిన సాహితీకారుడు. తెలుగు, ఉర్దూ, ఆంగ్ల భాషా ప్రవీణుడు. వక్త, పరిశోధకుడు. రాజ్యసభ సభ్యుడిగా పని చేశారు. 1950 నుంచి 1979 వరకు ఉస్మానియా యూనివర్శిటీ సెనేట్, సిండికేట్ సభ్యుడిగా కొనసాగారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ తొలి కార్యదర్శి. 1993 జూన్ 8న కన్నుమూశారు.

సీన్ కానెరి (జయంతి)



సర్ థామస్ సీన్ కానెరి 1930 ఆగస్టు 25న యునైటెడ్ కింగ్‌డమ్‌లో జన్మించారు. స్కాటిష్ యాక్టర్‌గా, నిర్మాతగా రాణించారు. 'జేమ్స్‌బాండ్' కేరక్టర్‌తో గుర్తింపు పొందారు. అకాడమీ అవార్డు, 2 బాఫ్తా అవార్డులు, 3 గోల్డెన్ గ్లోబ్స్ పురస్కారాలు అందుకున్నారు. 'ది గ్రేటెస్ట్ లివింగ్ స్కాట్, స్కాట్లాండ్స్ గ్రేటెస్ట్ లివింగ్ నేషనల్ ట్రెజర్ పురస్కారాలు అందుకున్నారు. 90వ యేట 2020 అక్టోబరు 31న కన్నుమూశారు.

వినేశ్ ఫోగట్ (పుట్టినరోజు)



వినేశ్ ఫోగట్ 1994 ఆగస్టు 25న హర్యానా రాష్ట్రంలో జన్మించారు. మహిళల్లో రెజ్లర్‌గా తనదైన గుర్తింపు పొందారు. కామన్వెల్త్‌లోనూ, ఏషియన్ గేమ్స్‌లోనూ బంగారుపతకం సాధించిన తొలి మహిళా రెజ్లర్. 2019లో 53 కిలోల విభాగంలో వరల్డ్ చాంపియన్ మెడల్ అందుకున్నారు. వేర్వేరు సంవత్సరాల్లో 48, 50, 53 కిలోల విభాగాల్లో ఆమె పాల్గొని ఒలింపిక్స్ గేమ్స్‌లో తనదైన రికార్డు నెలకొల్పారు. 2016లో అర్జున అవార్డు, తాజాగా 2020 ఆగస్టులో రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న పురస్కారాన్ని దక్కించుకున్నారు. 2021 పోలెండ్ ఓపెన్‌లోనూ, 2022 కామన్వెల్త్ గేమ్స్‌లోనూ గోల్డ్‌మెడల్ సాధించారు.

శ్రావణ శనివార శోభ



చింతామణిలో చౌడేశ్వరి దేవికి పూజలు



గడిదంలో శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీవెంకటేశ్వరస్వామికి అలంకరణ

బెంగళూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం మూడో శనివారం పురస్కరించుకుని నగరంలోని పలు ఆలయాలలో విశేషపూజలు సాగాయి. ప్రత్యేకించి లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారికి అభిషేకం, అలంకరణ, లోకకల్యాణార్థం హోమాదికాలు నిర్వహించారు. కోటె వెంకటేశ్వర స్వామి ఆలయంలోనూ, జేపీనగర్ తిరుమలగిరి లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం, ప్రముఖ సీతారాముల ఆలయాల్లోనూ, ఆంజనేయస్వామి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు కొనసాగాయి. కాగా జయనగర ఒకటో బ్లాక్ సిద్దాపుర పరిధిలోని గుట్టె పాళ్యలో కొలువైన శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేకించి గవ్వలతో అలంకరించారు. తోమాల, పూలమాలలు సమర్పించారు. విశేష హోమాల అనంతరం భక్తాదులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

బాగేపల్లిలో..

బాగేపల్లి: తాలూకాలోని దేవరగుడిపల్లి (గడిదం) లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి విశేష కైంకర్యాలు నిర్వహించారు. సుదూర ప్రాంతాలనుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయాన్ని వివిధ పుష్పాలతో ముస్తాబు చేశారు. ప్రధాన అర్చకుడు డాక్టర్ అశ్వథనారాయణస్వామి నేతృత్వంలో పూజా కార్యక్రమాలు కొనసాగాయి.

చింతామణిలో..

చింతామణి: పట్టణ శివారులోని కోలారు రోడ్డులోగల కురుటహళ్ళి వీరాంజేయస్వామికి శనివారం నవధాన్యాలతో అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. తాలూకాలోని అనూరు చెరువుకట్ట కింద ఉన్న చౌడేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకం, పుష్పాలంకరణ చేశారు. పట్టణంతోపాటు తాలూకా వ్యాప్తంగా ఉన్న వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలలో విశేష పూజలు నిర్వహించగా సందడి నెలకొంది. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



సిద్దాపుర గుట్టెపాళ్యలో వెంకటేశ్వరస్వామికి అలంకరణ



కురుటహళ్ళిలో వీరాంజనేయస్వామికి నవధాన్యాలతో అలంకరణ

ఆయనతో కలిసి శాసనసభలోకి ప్రవేశించా : సీఎం



సూర్యనారాయణరావుకు నివాళి అర్పిస్తున్న సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వామపక్ష నాయకులు సూర్యనారాయణరావ్, తాను ఒకేసారి శాసనసభలోకి ప్రవేశించామని సీఎం సిద్దరామయ్య వెల్లడించారు. సూరిగా చిర పరిచితులైన ఆయన రాష్ట్ర కార్మికుల ధ్వనిగా నిలిచారన్నారు. శనివారం నగరంలోని టౌన్‌హాల్‌లో సూర్యనారాయణరావ్ శతజయంతిని పురస్కరించుకుని ఏర్పాటైన 'కర్ణాటక అభివృద్ధిలో కార్మిక పోరాటాల పాత్ర' అనే అంశంపై జాతీయ చర్చాగోష్టిలో మాట్లాడారు. కార్మికుల సమస్యలపై శాసనసభ బయటా, లోపలా సూర్యనారాయణ పోరాటం చేశారన్నారు. ఎలాంటి అంశమైనా సమగ్రంగా చర్చించేవారన్నారు. కమ్యూనిస్టు కార్యకర్తలు సామాన్యంగా అధికారానికి ఆశపడేవారు కాదన్నారు. పోరాటానికే ప్రాధాన్యత ఇచ్చేవారన్నారు. ప్రజల సమస్యలకు పరిష్కారం లభించేంతవరకు శాసనసభ లోపల పట్టువీడకుండా పోరాటం చేయడాన్ని ప్రస్తావిస్తూ ఆయన కార్యవైఖరిని కొనియాడారు. తాను కార్మికశాఖ మంత్రిగా ఉన్నప్పుడు కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు పోరాటాలను వీడేవారు కాదని గుర్తు చేసుకున్నారు. ఇటీవల అసత్యాలను ప్రచారం చేసే ధోరణిని మనం చూస్తున్నామని వీటికి భిన్నంగా వాస్తవాంశాలతో ప్రభుత్వాన్ని సూరి ప్రశ్నించేవారన్నారు. శాసనసభ లోపలా, బయటా శాంతియుత పోరాటం చేసేవారన్నారు. తమ ప్రభుత్వం శ్రామి కవర్గాల సంక్షేమానికి పలు కార్యక్రమాలు రూపొందించిందన్నారు. తాము అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలు కోట్లాదిమందికి భరోసా ఇస్తున్నాయని అయితే బీజేపీ, ఆర్ఎస్ఎస్ వంటివి ఓర్వలేక ప్రతిఘటిస్తూనే ఉన్నాయన్నారు. కార్యక్రమానికి బిజికె నాయర్ అధ్యక్షత వహించగా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్, కామ్రేడ్ సూర్యనారాయణ కుమార్తె రేఖా తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానం



ప్రతిభా పురస్కారాల ప్రదానంలో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

బంగారపేట, ఆగస్టు 24: ఎస్ఎన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పాతికేళ్లుగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తోందని నగర మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆర్థికమండలి అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి వెల్లడించారు. పట్టణంలోని ఎస్ఎన్ రిసార్టులో సర్వోదయ ప్రతిభా పురస్కారాలను శనివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీ, డిగ్రీలలో అత్యధిక మార్కులు పొందిన అన్ని సామాజికవర్గాల విద్యార్థులను గుర్తించి ప్రతిభా పురస్కారం ఇస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చక్కగా చదివి ఉన్నత హోదాలలో రాణించి తాలూకా కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపచేయాలన్నారు. రానున్న రోజుల్లో ప్రాథమిక పాఠశాలనుంచి డిగ్రీ వరకు విద్యార్థులకు నోటుపుస్తకాలను ఉచితంగా ఇవ్వనున్నట్టు తెలిపారు. తాలూకాలో సా మూహిక వివాహాల కార్యక్రమాన్ని మళ్లీ ప్రారంభిస్తామన్నారు. త్వరలోనే డీసీసీ బ్యాంకులో మహిళలకు వడ్డీ రహిత రుణాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ చెప్పినట్లుగా విద్య ఉంటే ఎవరూ దొంగలించలేరన్నారు. ఐకమత్యం, పోరాటం ఉంటే ఏదైనా సాధించవచ్చునన్నారు. ఐఏఎస్, ఐపీఎస్, కేఏఎస్ చేయాలనుకున్నవారికి ట్రస్టు తరపున విద్యార్థులకు మూడు నెలలు కోచింగ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. తహసీల్దార్ వెంకటేశప్ప, నగరాభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు గోపాలరెడ్డి, సమాజసేవకుడు మునిరాజు, ఆలుగడ్డ శేఖర్, బాబు, వర్తూరు బాబు, బీఈఓ సుకన్య, సమన్వయ అధికారి శశికళ, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడిగా ఆంజనేయగౌడ, నారాయణస్వామి, రఫీక్, ముక్తియార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ అమలు చేయండి



మీడియా సమావేశంలో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గజేంద్ర

శిడ్లఘట్ట, ఆగస్టు 24: ప్రస్తుతం అమలులో ఉన్న నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షుడు గజేంద్ర డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం మీడియాతో మాట్లాడారు. సీఎం సిద్దరామయ్య కొత్త పెన్షన్ విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చారని అయితే ఇంతవరకు అమలు కాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికే రెండు కమిటీలు ఏర్పాటు చేశారని ఒక కమిటీ కూడా కనీసం ఒక సమావేశం నిర్వహించలేదని, అధ్యయనం చేయలేదని, నివేదిక ఇవ్వలేదన్నారు. అయితే మళ్లీ మూడో సమితి ఏర్పాటు చేశారని దీని అవసరం ఏమన్నారు. ఇచ్చిన హామీ అమలు చేయడానికి ఎలాంటి ఆటంకం లేదని అయినా పట్టించుకోలేదన్నారు. మీడియా సమావేశంలో ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయుల సంఘం మురళి, ఎన్‌పీఎస్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి నరసింహరాజు, కోశాధికారి నరసింహప్ప, సహకార్యదర్శి సరితా తదితరులు పాల్గొన్నారు.

జంబూసవారి కళాబృందాలకు అర్జీల ఆహ్వానం

బెంగళూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మైసూరు దసరా ఉత్సవాలలో కీలకమైనది జంబూసవారి ఘట్టం. ఈ వేడుకను చూసేందుకు రాష్ట్రంనుంచే కాక దేశ విదేశాలనుంచి భక్తులు, పర్యాటకులు వస్తుంటారు. జంబూ సవారిలో పాల్గొనే ఆసక్తి గల కళాబృందాల నుంచి అర్జీలు ఆహ్వానిస్తున్నారు. సెప్టెంబరు 10లోగా సమర్పించాలని దసరా పరేడ్ సబ్ కమిటీ డిప్యూటీ స్పెషల్ ఆఫీసర్, మైసూరు సిటీ పోలీస్ కమిషనర్ సీమాలాట్కర్ ప్రకటన కోరారు. అక్టోబరు 12న జరిగే జంబూసవారి కవాతులో పాల్గొనేందుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల జానపద కళా బృందాలనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పేర్కొ న్నారు. పరేడ్‌లో పాల్గొనే బృందాలు తమ బృందం ఫో టో, జట్టు సభ్యుల వివరాలు, పోస్టల్, చిరునామా, బృం దం నాయకుడి మొబైల్ నెంబరు వంటి వివరాలు పొందుపరచాల్సి ఉంటుంది. అర్జీలను ప్రత్యేక అధికారి దసరా మెరవణి ఉపసమితి, పోలీస్ కమిషనర్ మైసూరు నగ రం, లేదా సహాయక డైరెక్టర్ (కో-ఆర్డినేటర్) దసరా మెర వణి ఉపసమితి, సాంస్కృతికశాఖ మైసూరుకు సమర్పిం చాల్సి ఉంటుందన్నారు.

ఆర్టీసీ పాయింట్‌లో మార్పు

బెంగళూరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి చిక్కబళ్ళాపుర, దొడ్డబళ్ళాపుర వైపు వెళ్లే ఏపీ ఎస్ఆర్టీసీ బస్సు ప్రయాణీకులకు 'ఎస్టీమ్ మాల్ బెం గళూరు బోర్డింగ్ పాయింట్‌ను తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్టు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (ఏటీఎం) రవీం ద్రనాథరెడ్డి నగరంలో శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక హెబ్బాళ పోలీసుల సూచన మేరకు నిర్ణ యం తీసుకున్నట్టు తెలిపారు. ప్రయాణీకులు హెబ్బాళ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న బోర్డింగ్ పాయింట్‌ను ఉపయోగించుకోవాలని ప్రకటనలో కోరారు.

చిన్నారి సామర్థ్యం పెంపుపై శ్రద్ధ

మహదేవపుర, ఆగస్టు 24: చిన్నారులకు విద్య అందించే విధానంలో కొత్తదనానికి పేరొందిన హాయ్‌కల్ప సంస్థ ప్రతి చిన్నారి వ్యక్తిగత సామర్థ్యం పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని సీఈఓ శాలిని శర్మ వెల్లడించారు. హాయ్‌కల్ప బ్రాండ్ అంబాసిడర్, నటి అమృతారావ్ గురించి సంస్థ సీఈఓ శాలినిశర్మ మాట్లా డుతూ సినీ రంగంలో రాణిస్తూనే హాయ్‌కల్ప సంస్థకు రాయబారిగా వ్యవహరిస్తుండడం హర్షం వ్యక్తం చేశారు. అమృతారావ్ మాట్లాడుతూ హాయ్‌కల్ప సంస్థతో చేతు లు కలపడం సంతోషంగా ఉందన్నారు. ఈ సంస్థ చిన్నా రుల సమగ్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు.

భార్య మృతితో భర్తకు గుండెపోటు



శేఖర్, సుమిత్ర దంపతులు (ఫైల్)

బెంగళూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): భార్య మరణవార్త విని భర్త కూడా మృతి చెందిన సంఘటన చామరాజనగర జిల్లా హనూరు తాలూకా మంగళ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శేఖర్ (70), సుమి త్ర (65) దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున సుమిత్రకు చాతీలో నొప్పి రావడంతో కామగెరె సమీపంలోని హోళిక్రాస్ వద్దగల ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స ఫలించక ఆమె శుక్రవారం రాత్రి మృతి చెందింది. సమాచారం వింటూనే భర్త శేఖర్ గుండెపోటుకు మృతి చెందాడు. భార్యాభర్తలిద్దరూ ఒకేసారి మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

తిమ్మరాయస్వామి కొండకు పాదయాత్ర

విజయపుర, ఆగస్టు 24: పట్టణంలోని యల్లమ్మ దేవా లయంలో విశేషపూజలు నిర్వహించిన అనంతరం ఆంజ నేయస్వామి పాదయాత్రకు భక్తుల బృందం పాదయాత్రగా బయల్దేరింది. శ్రావణ మాసంలో 13వ సంవత్సరం తాలూకాలో సుమారు పదికిలోమీటర్ల దూరంలోగల తిమ్మ రాయస్వామి కొండకు వేలాదిగా భక్తులు పాదయాత్రగా బయల్దేరారు. ఉదయాన్నే పట్టణంలోని ప్రముఖ ఆలయాలను సందర్శించిన బృందం శ్రీరాముడి కీర్తనలతో బయ ల్దేరింది. కార్య క్రమంలో ఎంవీ నాయుడు, తిమ్మ రాయప్పస్వామి, సుబ్బణ్ణ స్వామి, పాల ఉత్పత్తి దారుల సహకార సంఘం మాజీ అధ్యక్షుడు ముని రాజు తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రగా బయల్దేరుతున్న బృందం

సమర్థనం పాఠశాలకు చేయూత



విద్యార్థులతో కలసి కేక్ కట్ చేస్తున్న వాసుదేవరెడ్డి

బొమ్మనహళ్ళి, ఆగస్టు 24: హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లోని సమర్థనం దివ్యాంగుల పాఠశాలకు అన్ని విధాలా చేయూత ఇస్తున్నామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, బొమ్మనహళ్ళి నియోజకవర్గ గ్యారెంటీ పథకాల కమిటీ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. అందరి సహకారంతో ఎంతో అభివృద్ధి చెందుతోందన్నారు. తన పుట్టిన రోజును శనివారం విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పుట్టినరోజును దివ్యాంగుల పాఠశాలలో ఆచరించుకుంటూ వస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పథకాలు అసలైన లబ్ధిదారులకు అందేలా చేయనున్నట్టు తెలిపారు. మంత్రి రామలింగారెడ్డి, మాజీ మంత్రి రేవణ్ణ, స్థానిక ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

ఏటీఎం దొంగల ముఠా అరెస్టు

- అనంత, చిత్తూరు, కర్ణాటకలో చోరీలు
- రూ.కోటి వరకూ మాయం.. రూ.2 లక్షలే రికవరీ..



వివరాలు వెల్లడిస్తున్న అనంతపురం ఎస్పీ జగదీశ్

అనంతపురం క్రైం, ఆగస్టు 24: ఏటీఎంలలో చోరీలకు పాల్పడుతున్న హరియాణా దొంగల ముఠాను అనంతపురం జిల్లా పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వివిధ ప్రాంతాల్లో రూ.అర కోటికి పైగా డబ్బు చోరీ చేసిన చేసిన వీరి నుంచి రూ.2లక్షలు మాత్ర మే పోలీసులు రికవరీ చేశారు. ఈ ముఠాను పట్టుకునేందుకు అనంతపురం నగరంలోని నాలుగు పోలీస్‌స్టేషన్ల సీఐలు, సీసీఎస్, స్పెషల్ బ్రాంచ్, టెక్నికల్ స్టాఫ్, కర్ణాటక పోలీసులు శ్రమించారు. మొత్తం 12 మంది సభ్యులున్న ముఠాలో ఐదుగురు దొరికారు. మిగిలినవారు పరారీలో ఉన్నారు. కేసు వివరాలను ఎస్పీ జగదీష్ శనివారం డీపీఓలో వెల్లడించారు.

అరెస్టయింది వీరే..

హరియాణాలోని నుహ జిల్లా అలీమియో గ్రామానికి చెందిన రాబిన్, ఘసేరాకు చెందిన సలీం, రోజ్‌కామియో గ్రామానికి చెందిన హక్మాఖాన్, అలీమియో గ్రామానికి చెందిన షాకీర్, రాజస్థాన్‌లోని భరత్ పుర జిల్లా ఆల్‌గని గ్రామానికి చెందిన మజీద్ అరెస్టు అయ్యారు. వసీం, సద్దాం, టౌసిఫ్, రాహుల్, హర్షద్, వారీష్, అతావుల్లా పరారీలో ఉన్నారు.

ఇవీ చోరీలు..

ఈ నెల 8న అనంతపురం నగరంలోని రామ్‌నగర్ ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ చేశారు. ప్రస్తుతం అరెస్టయిన ఐదుగురు, పరారీలో ఉన్న ఏడుగురు అక్కడికి వెళ్లారు. పోలీసులు, స్థానికులు గమనించకుండా ఎనిమిది మంది ఏటీఎం వద్ద వలయంగా ఏర్పడ్డారు. గ్యాస్ కట్టర్ నిపుణుడు సద్దాం సహా నలుగురు ముఖాలకు ముసుగులేసుకుని ఏటీఎం మిషన్‌ను కట్ చేశారు. అందులో ఉన్న రూ.29.80 లక్షలను ఎత్తుకెళ్లారు. ఇదే తరహాలో ఈ నెల 2న కల్లూరు ఎస్బీఐ ఏటీఎంలో రూ.3,26,600, జూన్ 7న కూడేరు మండల కేంద్రంలో రూ.18,41,300 ఏటీఎంలలో చోరీ చేశారు. ఫిబ్రవరి 8న అనంతపురం నగరంలోని ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఏటీఎం మిషన్‌ను కట్ చేసి నగదు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీస్‌సైరన్ రావడంతో పారిపోయారు. కర్ణాటక రాష్ట్రంలోని చిక్‌బళ్లాపూర్‌లో ఏటీఎం సెంటర్‌లో రూ.18,24,500 చోరీ చేశారు. చిత్తూరు జిల్లా గుడిపాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏటీఎం సెంటర్లో రూ.25,98,400 చోరీ చేశారు.

అరెస్టు ఇలా..

అనంతపురం జిల్లాలో వరుసగా ఏటీఎంలలో చోరీలు జరగడంతో అప్పటి ఎస్పీ కేవీ మురళీకృష్ణ, నూతన ఎస్పీ జగదీష్ కేసులను ఛేదించాలని ఆదేశించారు. డీఎస్పీ టీవీవీ ప్రతాప్ ఆధ్వర్యంలో సీఐలు ఇస్మాయిల్, ప్రతాప్‌రెడ్డి, శ్రీధర్, శివరాముడు, షేక్ జాకీర్, సాయినాథ్, ఎస్ఐలు నాగమధు, గౌస్‌బాషా, రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో హెచ్‌సీలు శివయ్య, మల్లికార్జున, నాగరాజు, కానిస్టేబుళ్ళు రంజిత్, దాస్, ఆసిఫ్, ప్రసాద్, అనిల్, ఫరూక్, బాలు, ఓబులేసు, వెంకటరమణ బృందాలుగా ఏర్పడ్డారు. నగర శివారులోని కక్కలపల్లి క్రాస్ సర్వీస్ రోడ్డు పక్కన పొదలలో అరెస్టు చేశారు. వారి నుంచి గ్యాస్ సిలిండర్, గ్యాస్ కట్టర్, 5 సెల్ ఫోన్లు, రూ.2లక్షల నగదు, 3 ఇనుప రాడ్లు, ఒక బాకు, కారం పొడి ప్యాకెట్, శానిటైజర్ స్ప్రే బాటిల్, పెయింట్ స్ప్రేలు, ఒక లారీని స్వాధీనం చేసుకున్నారు.

ముఠా నేపథ్యం

ముఠాలో రాబిన్, సలీం కీలక నిందితులు. షాకీర్ ట్రక్ డ్రైవర్. హరియాణా నుంచి బెంగళూరు హైవే మీద ప్రయాణిస్తూ.. ఏటీఎం కేంద్రాలు, అక్కడి భద్రత, సీసీ కెమెరాలు, రద్దీని గుర్తిస్తాడు. సులువుగా దొంగతనాలు చేసేందుకు అనువుగా ఉన్న ఏటీఎం కేంద్రాలను ఎంపిక చేసి.. రాబిన్, సలీంకు సమాచారం చేరవేస్తాడు. గ్యాస్ కటింగ్‌లో అనుభవమున్న సద్దాంతో రాబిన్ చర్చించి.. మిగిలిన సభ్యులను సమీకరించుకుంటాడు. అనంతరం ముఠా సభ్యులు నకిలీ నంబర్లతో రెండు కార్లలో ఎంపిక చేసుకున్న ఏటీఎం కేంద్రాలకు వస్తారు. ప్రజలు గాఢ నిద్రలో ఉన్న సమయంలో.. అర్ధరాత్రి 2 గంటల నుంచి తెల్లవారు జామున 4 గంటల మధ్యలో చోరీ చేస్తారు. చోరీ చేసిన సొమ్ములో కొంత మొత్తాన్ని ముఠా సభ్యులకు ఇచ్చి, మిగిలిన మొత్తాన్ని రాబిన్ తన వద్దే ఉంచుకుంటాడు. హరియాణా వెళ్లాక వాటాలు వేసుకుంటారు. ఎస్‌బీఐ ఏటీఎంలలో ఎక్కువ నగదు ఉంటుందని.. వాటినే ఎక్కువగా చోరీలకు ఎంచుకుంటారు. చిత్తూరు జిల్లా గుడిపాల ఏటీఎం చోరీలో కేసులో రాబిన్, సద్దాం, టౌసిఫ్ నిందితులు.

రారా కన్నయ్య... కిట్టయ్య

కృష్ణాష్టమిని పురస్కరించుకుని నగరంలోని ప్రముఖ కూడళ్లు, మార్కెట్‌లలో రాధాకృష్ణుల విగ్రహాలు విక్రయిస్తున్నారు. ప్రత్యేకించి చిన్ని కృష్ణుడు రూపాలకు డిమాండ్ ఉంది. వివిధ సైజుల్లో నీలిరంగుతోపాటు బంగారు వన్నెతో కూడిన విగ్రహాలు, వేణువు ధరించిన శ్రీకృష్ణుడి విగ్రహాలు విక్రయిస్తున్నారు.

- బెంగళూరు, ఆంధ్రజ్యోతి



నాగరభావి ప్రాంతంలో విగ్రహాలకు తుదిరూపు...